నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ ఆదివారం 9 జూన్ 2024 | ADILABAD NIRMAL


## లక్కీ లాటరీ ద్వారా హోంగార్డుల బదిలీ



హోంగార్డుల బదిలీ సందర్భంగా మాట్లాడుతున్న ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, జూన్ 8 : ఆదిలాబాద్ జిల్లాలో 97 మంది హోంగార్డులను లక్కీ లాటరీ విధానం ద్వారా బదిలీ చేసినట్లు ఎస్పీ గౌష్ ఆలం పేర్కొన్నారు. శనివారం స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో హోంగార్డుల బదిలీ ప్రక్రియను ఎస్పీ అధ్యక్షతన పూర్తి చేశారు. నిర్మల్ జిల్లా నుంచి 62 మంది, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి 35 మంది హోంగార్డులు ఆదిలాబాద్ జిల్లాకు రానున్నారు. వారి స్థానంలో ఆదిలాబాద్ జిల్లా నుంచి 97మంది బదిలీ అయ్యారు. బదిలీ ప్రక్రియను అపోహలు లేకుండా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, ఆర్ఐ సీఐ నవీన్, మురళి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని ప్రైవేట్ దవాఖానలపై చర్యలు



నిర్మల్‌లో ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న అధికారులు

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 8 : నిబంధనలు పాటించని ప్రైవేటు దవాఖానలపై వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 200లకు పైగా ఆసుపత్రులు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో కొన్ని రోజులుగా అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు ఆసుపత్రులను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న దేవేందర్‌రెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, సూర్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, నారాయణ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులకు నోటీసులు జారీ చేశారు. 2010 నియమ నిబంధనల ప్రకారం ఆసుపత్రులను నిర్వహించాలని, అనుమతులు తీసుకోకుండా ఆసుపత్రులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని నిర్మల్ డీఎంహెచ్ఓ ధన్‌రాజ్ పేర్కొన్నారు.

# ఉపాధ్యాయులకు బదిలీలు

- షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం
- ఆదిలాబాద్ జిల్లాలో 300లకు పైగా మందికి ప్రమోషన్లు

ఆదిలాబాద్, జూన్ 8(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. పలు కారణాలతో ఎనిమిది నెలలుగా నిలిచిన ప్రక్రియ శనివారం ప్రారంభమైనట్లయింది. షెడ్యూల్ ప్రకారం 8,9 తేదీల్లో సీనియారిటీ జాబితా వెల్లడి, 10,11 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, 12 తేదీన సీనియారిటీ తుది జాబితా విడుదల కానుంది. ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు పదోన్నతులకు వెబ్ అప్షన్ల ఎంపిక, పదోన్నతుల కల్పన, ఈ నెల 17న ఎస్జీటీ సీనియారిటీ, ఖాళీల జాబితా ప్రదర్శిస్తారు. 18, 20 తేదీల్లో బదిలీల వెబ్ అప్షన్ల ఎంపిక అనంతరం 21, 22 తేదీల్లో ఉత్తర్వులు జారీ చేస్తారు. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్‌లో ఎస్జీటీ, పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరనుంది. రిటైర్మెంట్ మూడేళ్లలోపు ఉన్నవారికి తప్పనిసరి మినహాయింపు ఇచ్చారు. టెట్‌కు సంబంధం లేకుండా ఎస్జీటీలకు ప్రమోషన్లు కల్పించడంపై హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

### 300 మందికి పైగా ప్రమోషన్లు

ఆదిలాబాద్ జిల్లాలో 3,028 మంది ఉపాధ్యాయులు ఉండగా, 2,467 మంది విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా కేటగిరీల్లో 300లకుపైగా ఖాళీలు ఉండే అవకాశాలున్నాయి. మొదటగా ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్లు ఇచ్చిన తర్వాత బదిలీలు చేపడుతారు. బదిలీల కోసం గతంలో 2008 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను విద్యాశాఖ అధికారులు తయారు చేశారు. గతంలో ట్రాన్స్‌ఫర్ అయి రిలీవ్ కాకుండా ఉన్న స్కూల్ అసిస్టెంట్‌లు వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 260 మంది ఉపాధ్యాయులకు వారికి కేటాయించిన స్కూల్స్‌లో జాయిన్ కానున్నారు. శనివారం ప్రారంభమైన బదిలీల ప్రక్రియ ఈ నెల 22తో ముగియనుంది.



తలమడుగు మండలంలోని కజ్జర్ల ప్రభుత్వ పాఠశాల







నిర్మల్ పట్టణంలో గ్రూప్-1 పరీక్షా కేంద్రం

# గ్రూప్-1కు రెడీ

- ప్రిలిమినరీ పరీక్షకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు..
- అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

నిర్మల్ అర్బన్, జూన్ 8 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివారం నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే కలెక్టర్‌లు పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రశాంతంగా నిర్వహించేందుకు చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, వైద్య, ఆరోగ్య, పోలీస్ శాఖల అధికారులు శనివారం ఏర్పాట్లను పూర్తి చేశారు. పరీక్షా కేంద్రాల్లో హాల్ టికెట్ నంబర్లను వేశారు. కాగా.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు 71 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 23,504 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు పరీక్ష ఉంటుంది. కేంద్రంలో తాగునీరు, బెంచీలు, ఫ్యాన్‌లు, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా..

| జిల్లా | కేంద్రాలు | అభ్యర్థులు |
|---|---|---|
| నిర్మల్ | 13 | 4,608 |
| ఆదిలాబాద్ | 18 | 6,729 |
| ఆసిఫాబాద్ | 13 | 2,783 |
| మంచిర్యాల | 27 | 9,384 |
| మొత్తం | 71 | 23,504 |

### కేంద్రాల వద్ద 144 సెక్షన్



నిర్మల్ జిల్లాలోని గ్రూప్-1 పరీక్షా కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు పరిచాం. ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి, జనాలు గుమిగూడకుండా చర్యలు చేపట్టాం. కేంద్రాల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటాం.

-జానకి షర్మిల, ఎస్పీ, నిర్మల్

## ఆయుర్వేదిక్ మందు పంపిణీ



గూళికలను పంపిణీ చేస్తున్న యువరాజ్ వైద్య దంపతులు

ఎదులాపురం, జూన్ 8 : మృగశిర కార్తెను పురస్కరించుకుని ఉబ్బసం వ్యాధి నియంత్రణతోపాటు రోగ నిరోధక శక్తిని పెంచడానికి అందించే ఆయుర్వేదిక్ మందు పంపిణీ కార్యక్రమం పెద్ద ఎత్తున సాగింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సీసీఐ క్రాస్‌రోడ్డు సమీపంలో గల వైద్య ఆయుర్వేదిక్ రిసెర్చ్ సెంటర్‌లో పంపిణీని నిర్వహించగా ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. యువరాజ్ వైద్య దంపతులు, కుటుంబీకులు పూజలు చేసిన అనంతరం ప్రజలకు గూళికలను పంపిణీ చేశారు. పెద్దలకు ఆయుర్వేదిక మూలికలతో తయారు చేసిన గూళికలను వేయగా.. చిన్నారులకు చుక్కల మందు వేశారు.



క్యూలైన్‌లో ప్రజలు

## క'న్నీటి' కష్టాలు

- కజ్జర్ల గ్రామానికి నాలుగు రోజులుగా సరఫరా కాని భగీరథ నీరు
- అడుగంటిన భూగర్భ జలాలు



నీటి కోసం పరుగులు పెడుతున్న వృద్ధులు

తాంసి, జూన్ 8 : మండలంలోని చాలా గ్రామాలకు మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో అందకపోవడంతో తాగు నీటికి గ్రామీణులు అవస్థలు పడుతున్నారు. బావులు, బోర్లలో నీరు అడుగంటి పోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. కజ్జర్ల గ్రామంలో మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజులుగా నీరు రాకపోవడంతో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా మైళ్ల దూరం నడిచి నీరు తెచ్చుకుంటున్నారు. గ్రామంలో 500లకు పైగా ఇండ్లు ఉండగా 400ల ఇండ్లలో బోరుబావులు అడుగంటిపోయాయి. అధికారులు భగీరథ నీరు అందేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### నీటి గోస ఎప్పుడు రాలే..



పదేళ్లలో ఏం పరేషాన్ లేకుండా తాగడానికి, ఇంటికాడికి భగీరథ నల్లా నీళ్లొస్తుండే. ఈసారి ఇంటికాడ బోర్లు ఎండిపాయే. ముందు నీళ్ల గోస మాకు ఎప్పుడు రాలే. ఏడనో పైపులైన్ పగిలి భగీరథ నీళ్లు నాలుగు దినాల నుంచి వస్తలేవు. ఇప్పుడేమో సమీప పొలంలో ఉన్న బోర్ల దగ్గరకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నం. తాగడానికి, వాడకానికి నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతి నిధులు పట్టించుకుని సమస్యను పరిష్కరించాలి.

- దోమల కిష్టమ్మ, కజ్జర్ల, తాంసి మండలం.

## కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్



కేసులను పరిష్కరిస్తున్న జడ్జి కర్ణకుమార్

నిర్మల్ అర్బన్, జూన్ 8 : కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ పేర్కొన్నారు. శనివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ ఉపయోగకరంగా ఉంటుందని, కక్షిదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి భవిష్య, లోక్ అదాలత్ మెంబర్లు రమణాగౌడ్, లింగయ్య, రమణారావు, ఫసియోద్దీన్, నివేదిత ఉన్నారు.

## 300 మందితో బందోబస్తు

ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, జూన్ 8 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు 300 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్రాల వద్ద విధులు నిర్వహించనున్న సిబ్బంది పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రంలోకి వెళ్లే సమయంలో అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. సెల్ పోన్, ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రంలోకి అనుమతించకూడదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ(పరిపాలన) బి.సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 'సార్లూ' ప్రారంభించండి..

- పాఠశాల భవన నిర్మాణ ప్రారంభంలో జాప్యం
- ఫ్లోరింగ్, బ్లాక్‌బోర్డులు, పేయింటింగ్ కోసం నిరీక్షణ



మస్కాపూర్‌లో రూ.1.50 కోట్లతో నిర్మించి అసంపూర్తిగా వదిలేసిన భవనం

ఖానాపూర్ రూరల్, జూన్ 8 : ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్, బాదనకుర్తి గ్రామాల్లో రూ.2.50 కోట్లతో కేసీఆర్ హయాంలో భవన నిర్మాణ పనులు చేపట్టారు. పనులు కూడా చివరి దశకు చేరుకోగా.. ఫ్లోరింగ్, బ్లాక్‌బోర్డులు, పేయింటింగ్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడం, కొత్త సర్కారు ఏర్పడడంతో బిల్లుల చెల్లింపులో జాప్యం అవుతున్నది. దీనికితోడు కాంగ్రెస్ సర్కారు బిల్లులు మంజూరు చేయకుండా.. అమ్మ ఆదర్శ కార్యక్రమంలో భాగంగా లక్షలు వెచ్చించి టాయిలెట్స్ నిర్మిస్తున్నది. కట్టిన వాటికి బిల్లులు మంజూరు చేయకపోగా.. కొత్తవాటిని నిర్మిస్తున్నది. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కారు మిగిలిన పనులను పూర్తి చేసి, పాఠశాలను అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

## కరంజిలో అత్యాధునిక వ్యవసాయ యంత్రం



చేనులో మందు పిచికారీ చేస్తున్న బులక్ స్ప్రేయర్

తాంసి(భీంపూర్), జూన్ 8 : భీంపూర్ మండలంలోని కరంజి(టీ)లో అత్యాధునిక వ్యవసాయ యంత్రం అందరిని ఆకట్టుకుంటున్నది. చింతల పోతారెడ్డి అనే రైతు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి బులక్ స్ప్రింక్లర్ స్ప్రేయర్ అనే యంత్రాన్ని రూ. లక్షకు కొని తెచ్చాడు. ఎడ్ల బండికే అమర్చే ఈ యంత్రం గడ్డి మందు లేదా పురుగుల మందు కలిపిన నీటి చుక్కలను భూమికి అందిస్తుంది. ప్రస్తుతం దుక్కి అయిన భూమిలో ఈ యంత్రాలతో గడ్డి పెరగకుండా మందు వేస్తున్నారు. తర్వాత పంటలకు దీని ద్వారా పురుగు మందు అందించవచ్చని.. దీంతో సమయం, కూలీ ఖర్చు కలిసివస్తుందని రైతు వివరించారు. ఒక రోజు కనీసం పదెకరాల్లో ఇది పని చేస్తుంది. రైతులకు సొంత చేలతోపాటు అవసరమైతే తోటి రైతులకు ఈ యంత్రం కిరాయితో ఆదాయం సమకూర్చుకునే వీలున్నది.

# సత్వర న్యాయం కోసమే లోక్ అదాలత్‌లు

### ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

ఎదులాపురం, జూన్ 8 : జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు కేసులను పరిష్కారం చేసుకుంటే ఇద్దరి గెలుపు అవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ చైర్మన్ కె.ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం డీఎల్ఎస్ఏ సమావేశ మందిరంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజీమార్గంలో పలువురు కక్షిదారులు కేసులు పరిష్కరించుకోగా వారికి పత్రాలను ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో పరిష్కారం అయిన కేసులు అప్పీల్ చేసుకోవడానికి వీలు ఉండదన్నారు. కేసులు పరిష్కారం చేసుకుంటే డబ్బు, సమయం ఆదా అవుతాయన్నారు. 25 సివిల్ కేసులు, 1595 క్రిమినల్ కేసులు, 15807 పీఎల్‌సీ కేసులు పరిష్కారం అయ్యాయి. ఈ సమావేశంలో న్యాయమూర్తులు పి.శివరాంప్రసాద్, డాక్టర్ ప్రమీలా జైన్, మంజుల సూర్యవార్, టి.దుర్గారాణి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి బి.సౌజన్య, బార్ అధ్యక్షుడు నగేశ్, డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సైబర్ క్రైమ్ డీఎస్పీ హాజిబ్‌ఉల్లా పాల్గొన్నారు.

### నగదు అందజేత

సైబర్ నేరస్తుల చేతులో మోసపోయిన పోశెట్టికి రూ.20 వేలు, వైద్యవిద్యార్థికి రూ.23,870, మసూద్ హైమాద్‌కు రూ.15 వేల నగదును జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్‌రావు, ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి అందజేశారు.



సైబర్ బాధితుడికి పోగొట్టుకున్న నగదు పత్రాన్ని అందజేస్తున్న జడ్జి కె.ప్రభాకర్‌రావు, ఎస్పీ గౌష్‌ఆలం

### జైలు సందర్శన

జిల్లా జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్‌రావు, జిల్లా ఎస్పీ గౌష్ ఆలంలు కలిసి సందర్శించారు. జైలు ఆవరణలో పచ్చదనం నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ జైల్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్‌ను అభినందించారు.

### కోర్టు స్థలాన్ని పరిశీలించిన జడ్జి



కోర్టు స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా జడ్జి ప్రభాకర్‌రావు

బోథ్, జూన్ 8 : బోథ్‌లో నూతనంగా నిర్మించ తలపెట్టిన కోర్టు భవన నిర్మాణ స్థలాన్ని శనివారం జిల్లా జడ్జి ప్రభాకర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే భవన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. ఆయన వెంట బోథ్ జడ్జి హుస్సేన్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వామన్‌రావ్ దేశ్ పాండే, అంగద్ కేంద్రే, మోహన్‌రావ్, పంద్రం శంకర్, ఆడెపు హరీశ్, కుమ్మరి విజయ్, జమీర్, దమ్మాపాల్, కోర్టు సూపరింటెండెంట్ శేఖర్‌రెడ్డి, ఎస్సై రాము ఉన్నారు.


నమస్తే తెలంగాణ

విలేకరులు కావలెను

అర్హతలు :

- పాత్రికేయులుగా పనిచేయాలన్న ఉత్సాహం.
- మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన.
- తెలుగు భాషపై పట్టు ఉండి.. చక్కగా రాయగలగాలి.
- ఇంటర్ ఉత్తీర్ణత సాధించి.. 30 ఏళ్లలోపు ఉండాలి.
- రిపోర్టింగ్‌పై ఆసక్తి ఉన్నవారురాత పరీక్ష, ఆ తర్వాత ఇంటర్వ్యూలకు హాజరుకావాలి.
- బయోడాటాతో రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు తెచ్చుకోగలరు.
- తెలుగు టైపింగ్ వచ్చిన వారికి ప్రాధాన్యం.

నిర్మల్‌కు కావలసిన కేంద్రాలు

1. నిర్మల్ టౌన్ 2. నిర్మల్ శివాజీచౌక్ 3. మామడ

ఆదిలాబాద్‌కు కావలసిన కేంద్రాలు

1. ఆదిలాబాద్ టౌన్ 2. ఆదిలాబాద్ రూరల్ 3. మావల
4. ఉట్నూర్‌టౌన్ 5. తలమడుగు 6. జైనథ్ రూరల్

రాతపరీక్ష తేదీ : 11-06-2024 (మంగళ వారం)

సమయం : ఉదయం 11 గంటలకు..

నిర్మల్ పరీక్షా స్థలం : వశిష్ట డిగ్రీ కళాశాల, భాగ్యనగర్ కాలనీ, బైంసా రోడ్, నిర్మల్

ఆదిలాబాద్ పరీక్షా స్థలం : టీఎన్‌జీవో భవన్, ఆదిలాబాద్

ఫోన్ నంబర్లు : 94403 83136, 9182777993, 9182777029